# అ లు పు

ఎక్కడో పులి గాండ్రించింది? గడ్డిదుబ్బులో పడుకుని మగత నిద్రలోవున్న లేడిపిల్ల వులిక్కిపడి లేచింది. చుట్టూచూసింది? తనెక్కడుందో క్షణం మర్చిపోయింది. చెట్లమీద కోతులు కిచకిచ మంటున్నాయి. లేడిపిల్ల భయంతో గజగజ వణికింది. చుట్టూ చూస్తే తనవాళ్లెవరూ లేరు. ఎక్కడికి పోయారో? తను ఒక్కతీ ఆడవి మధ్యలో వుండిపోయింది—

దూరంగా మళ్ళీ పులి గాండ్రింపు దిక్కుల్ని పెళ్ళగించింది. లేడిపిల్ల ఛెంగున ఎగిరింది. తనక్కడ క్షణం వున్నా ప్రమాద మేనని కంగారుగా ఎగిరింది. భయంతో తడబడి ముందుకాలు మడతపడి సన్నగా మూల్గింది. బలాన్నంతా పుంజుకుని పరుగు లంఘించుకుంది. లేడిపిల్ల చెంగు చెంగున ఎగురుతూ ముందుకు వురుకుతోంది. దారి తెలియటంలేదు. తను ఎటు నుంచి వచ్చిందో గుర్తు రావటములేదు. పనసచెట్టు నీడలో పచ్చిక మేసినట్టు గుర్తు. అదెక్కడా కనిపించదే? సెలయేటి మధ్యలో నల్లబండ రాయిమీద నిలబడి నీరు తాగిన గుర్తు. అసలు ఏదెక్కడికి పోయిందో తెలీడంలేదే–

పులి గాంభ్రీంపు క్రమేపీ దూరమైంది. అంటే తను పులులుండే అడవి దాటిపోయిందన్నమాట. ధైర్యం చిక్కింది. కాళ్ళలో బలం పెరిగింది_

ఇంతలో మళ్ళీ సింహగర్జన.

లేడిపిల్ల గమ్యమెరుగని పరుగు. దారితప్పిన లేడిపిల్ల గాభరాతో. భయంతో అదిరే గుండెలతో ఆగలేని పరుగు.

లేడిపిల్ల ముందుకు పరుగెడుతూనే వుంది.

* * *

గడియారం అయిదున్నర కొట్టింది. హరిణ హఠాత్తుగా తలెత్తి గడియారంకేసి చూసి, ఆఫీసంతా పరికించింది. ఎవ్వరూ లేరు. అంతా వెళ్ళిపోయారు. ఆఫీసు టైము ఎప్పుడో అయిపోయింది-ఎంత జాగ్రత్తగా చేసినా స్టేట్‌మెంట్ టాలీ కావటంలేదు. ఆఫీసు మేనేజరు వ్యాఘ్రేశ్వర రావు బయటికెళ్ళి కాఫీతాగి వక్కపొడి నములుతూ వచ్చి తన సీట్లో కూర్చుని సిగరెట్ వెలిగించాడు.

సిగరెట్ పొగ రింగులు తిరుగుతూ పైకిపోతోంది. హరిణ మనసులో ఆలోచనలు గందరగోళంగా వెనక్కీ ముందుకీ కదులుతున్నాయి. అందుకే అంకెలు కలిసిపోతున్నాయి. కూడిన కూడిక సగంలో టప్‌మని తెగిపోతోంది. మళ్ళీమొదలు- మళ్ళీ తెగిపోతోంది-

గడియారం ముల్లుమాత్రం ముందుకే సాగిపోతోంది. గడియారం ముల్లు ఆరు మీదకి వస్తుంటే హరిణకి భయంగా దడగా వుంటుంది. ఏదో బలహీనత ఆవరిస్తుంది. నరాలన్నీ నీరసంగా, నిస్సత్తువగా అయిపోతాయి.

సరిగ్గా ఆరుగంటలకి అయిదు నిముషాలుందనగా ఆరోజు పదిమంది తన తండ్రి శవాన్ని వ్యానులో తీసుకొచ్చి యింటిముందు దింపారు. నలభై

నాలుగేళ్ళకే తన తండ్రికి నూరేళ్ళు నిండాయి. అమ్మ కళ్ళుతిరిగి పడిపోయింది. తను మతిపోయిన దానిలా బిత్తరపోయి నిలబడి పోయింది. తమ్ముళ్ళిద్దరూ అమ్మదగ్గర కూర్చుని ఏడుపు మొదలుపెట్టారు. చెల్లెలు విషయం అర్థం చేసుకుని దుఃఖంతో 'అక్కా' అంది—

ఆ క్షణాలు, ఆ హఠాత్పరిణామం ఆమె మనసుమీద ఎలా పని చేసిందో -తనకా సమయం అంటే భయం—

హరిణ ఆలోచనలు సాగిపోతున్నాయి. స్టేట్ మెంటు ఆగిపోయింది.

"ఏమిటి మీ పని కాలేదా" అంటూ ఆమె దగ్గరకొచ్చి పలకరించాడు వ్యాఘ్రేశ్వరరావు.

హరిణ తడబడి లేచి నిలబడింది.

"ఎస్సర్, అయిపోవచ్చింది" అంది-

"పోనీ రేపు చూసుకోవచ్చు-" అంటూ వాచీచూసి, బర్రుమని ఒక కుర్చీలాక్కుని ఎదురుగా కూర్చున్నాడు. హరిణ మనసు గడగడ వణికిపోయింది.

"ఏమిటండీ మీరింత భయస్తులు. వుద్యోగంలో చేరి రెండునెలలైందంటే ఎలావుండాలి?" అన్నాడు సూటిగా ఆమెని చూస్తూ.

హరిణకి ఏంచెయ్యాలో తెలీలేదు. ఒక నవ్వు నవ్వింది. "అయినా మీరు జాయిన్ అయ్యాక పార్టీ యిచ్చారా" అన్నాడు.

హరిణ అయోమయంగా చూసింది. అతని ఎక్స్‌రే చూపులు ఆమె ప్రతి అవయవాన్నీ పలకరిస్తున్నాయి.

"నాకింద రెండురోజులు ఎవరు పనిచేసినా ఈ బెరుకుతనం- అవీ-పోతాయి" అన్నాడు ఓరగా ఆమెనే చూస్తూ.

హరిణ మరీ ముడుచుకు పోయింది. ఆమె మనసు పరుగులు పెట్టే స్తోంది ఏమిటి? తనేం చేయాలి? గట్టిగా ఏమైనా సమాధానం చెప్తే. అతను మాట్లాడిన మాటల్లో తప్పేముంది? వున్నదంతా ధ్వనిలోనే వుంది- అది తన మనసుకి మాత్రమే తెలుస్తుంది-ఆ దేవుడికి కూడ దీనర్థం తెలీదు!

పేదరాలి కోపం పెదవిలోనే ఆగిపోయింది. వ్యాఘ్రేశ్వరరావు సిగరెట్ కాలుస్తూ నిశ్శబ్దంగా కూర్చుండి పోయాడు.

అంత హఠాత్తుగా నాన్నెందుకు చచ్చిపోవాలి అనిపించింది. హరిణ చదువే అంత శ్రద్ధగా చదవలేదు. ఆమెకి చదువుకోవాలనే వుండేది కాదు. ఏదో తల్లితండ్రుల పోరువల్ల పరీక్షలకెళ్ళింది. అత్తెసరు మార్కులతో ప్యాసయింది – తనకి వుద్యోగం చెయ్యాలని ఎప్పుడూ లేదు. తను ఏ యింజనీరునో, డాక్టరునో పెళ్ళాడి సుఖంగా కార్లలో తిరగాలనుకునేది. తన తండ్రి చేసింది మంచి ఉద్యోగమైనా, దాచింది మాత్రం ఏమిలేదు. తల్లి, తనతో నలుగురు పిల్లలు అనాథలు కాకపోయినా నీడలేని పక్షుల్లా అయిపోయారు. నాన్నగారి ఫ్రెండు "చదువుకున్న పిల్లవి. ఉద్యోగంలో చేరు" అంటూ యీ ఉద్యోగం వేయించారు. చుట్టూ మగాళ్ల - కోతుల్లా ఇకిలించేవాళ్లు-, నోరుండి దగ్గరకొచ్చి కోతలు కోసేవాళ్ళు-

హరిణకి ఎంతో చిన్నతనంగా, చిరాకుగా వుంటుంది -

"మిస్ హరిణా మీరెళ్ళిపొండి. అది రేపు ఫస్టవర్ చూసుకో వచ్చు" అంటూ లేచాడు మేనేజర్.

హరిణ గబగబా సర్దేసింది- నీరసంగా వున్నా బయటకి వచ్చేస్తున్నా ననే ఆనందంలో వుత్సాహంగా కదిలింది—

"రేపు వచ్చిన వెంటనే అది చూసి నాకు పుటప్ చెయ్యి" అన్నాడు వ్యాఘ్రేశ్వరరావు.

అతని ఏకవచన సంబోధనకు మనసు చివుక్కుమన్నా-

"ఎస్ సర్" అని కదిలింది హరిణ.

రోడ్డుమీద ఎన్నో దీపాలు కలకలమంటూ వెలుగుతున్నాయి. అయినా ఆమె మనసులో చీకటిగా వుంది. కార్లూ, సైకిళ్ళూ, రిక్షాలు, ఒకటే రొద. కాని ఆమె మస్తిష్కంలో ఎంతో ఖాళీ - నిశ్శబ్దం మొద్దుబారిపోయిందా బుర్ర.

నడుస్తోంది. బస్సుకోసం ఎదురుచూసే ఓపిక లేదు. ముందుకు నడిచి పోవాలి - నడిచిపోవాలి - అదే హరిణ వుద్దేశ్యం. ఆమె కంటె ఆమె మనసు మరీ ముందుకు వేగంగా పరుగెడుతోంది. కనిపించే ప్రపంచ మంతా జీవముండి నోరులేని అడవిలా - జీవంలేని రాళ్ళగుట్టలా, కదిలే నదిలో కొట్టుకొస్తున్న చెత్తలా వుంది.

ఇంటికెళితే ఎంతో పని. అమ్మ పూర్తిగా మంచమెక్కింది. చెల్లా యికి చదువు ధ్యాస. ఏదో వంతు వేసుకుని కొంతపని చేస్తుంది. మిగిలి నదే తనకోసం అట్టెపెడుతుంది.

వెనుకనుంచి స్పీడుగా వెళ్ళిపోయింది వ్యాఘ్రేశ్వరరావు కారు. హరిణ మనసు అసూయతో కుతకుత లాడిపోయింది. ఇంట్లో అడుగు పెడుతుంటేనే వనజ వచ్చి-

"అక్కా, అమ్మకేమీ బాగాలేదు" అంది.

"ఏం? ఎందుకని?"

"ఏమో ఒకటే నీరసం. వేళ్ళాడిపోతోంది - మాట్లాడలేక పోతోంది—"

"డాక్టరు దగ్గరికి తీసుకెళ్దాం—"

"ఉండు. నువ్వు కాళ్ళు కడుక్కో. కాఫీ యిస్తా-"

ఇద్దరూ తల్లిని హాస్పిటల్‌కి తీసికెళ్ళారు. డాక్టరుగారు ఎంతో అభి

మానంగా చూశారు. మందులు వ్రాసిచ్చి హరిణతో ప్రత్యేకం చెప్పారు, ఆమె హఠాత్తుగా ఏమీ వినకూడదని.

○ ○ ○

ఎప్పుడూ ఆఫీసు టైము లోపల హరిణ పని పూర్తి కాదు. అంతా వెళ్ళిపోతారు. తనొక్కతే కూర్చుని చెయ్యాల్సి వస్తుంది.

హరిణ ఎన్నోసార్లు అనుకుంది, వుద్యోగం మానేద్దామని. కాని ఎలా మానడం? యింట్లో ఏమని చెప్పడం. తన జీతం వస్తేనే యింట్లో గడవడం కష్టంగా వుంది.

అక్కడికీ ఒకరోజు అంది.

"ఈ వెధవ ఉద్యోగం మానేస్తే బాగుండును" అని.

దానికి తల్లి ఆశ్చర్యంగా చూస్తూ "అదేమిటే - ఆయన దయవల్ల వచ్చిందిగాని, నీకు కావాలంటే యిలాంటి వుద్యోగం కోటి జన్మలెత్తినా వస్తుందా" అంది.

"చుట్టూ మగాళ్ళు. కొక్కిరాయి మాటలు, కోతి చేష్టలు, చిరాకుగా వుంటుంది" అంది విసుగ్గా.

"మన దారిని మనం పోవడమే" అంది తల్లి నెమ్మదిగా. ఆమె ఉద్యోగం చెయ్యడం గురించి ఆలోచించలేదు. కనీసం వూహించలేదు. కాని హరిణ జీతం యింటికి రాకపోతే యింటి పరిస్థితి మాత్రం వూహించ గలదు. అందుకే అలా అంది.

ఇంతలో వనజ అందుకుంది.

"అయినా అన్నిటికీ నువ్వు వుమ్మెత్త పూవులా ముడుచుకుపోతే ఎలాగే. సరదాగా వుండాలి. నలుగురితో కలిసి మెలిసి తిరగాలి - నీది నానుముచ్చు తనం. ఎవరూ ఏమీ అనకపోయినా ముడుచుకు పోతుంటావు" అంది హితబోధ చేస్తున్నట్లు.

హరిణకి వనజమీద అసహ్యం వేసింది. "తనకంటే చిన్నది. తనకే బుద్ధులు చెప్తోంది. పైగా కలిసి మెలసి వుండాలిట. ఇది మరీ బరితెగించి పోయింది" అనుకుంది. పైకి మాత్రం ఏమీ అనలేదు. నిశ్శబ్దంగా వుండిపోయింది. తల్లి, వనజ మాటలు విని ఏమీ అనకపోవడం హరిణకి మరీ ఆశ్చర్య మేసింది.

వ్యాఘ్రేశ్వరరావు రోజూ ఏదో సమయం చూసుకుని "పార్టీ యివ్వలేదే" అంటాడు. ఏం సమాధానం చెప్పాలో ఆమెకి తెలీదు.

"మీ రింక పార్టీ యివ్వకపోతే వదిలేది లేదు" అన్నాడు చిరు నవ్వుతో.

హరిణ వెంటనే బ్యాగులోంచి రూపాయి తీసి, రెండు కాఫీలు తెమ్మంది ప్యూనుతో.

వ్యాఘ్రేశ్వరరావు చప్పరించేశాడు "ఓస్. ఇదా. ఎవరిక్కావాలండీ కాఫీ, మీకు వరసగా నే నిప్పిస్తా" అన్నాడు.

"మరి పార్టీ అంటే యింకేమిటి?"

"ఇప్పిస్తానన్నండి. నే చెప్తా" అన్నాడు సూటిగా చూస్తూ. హరిణకి అర్థమౌతూనే వుంది. కాని ఏమీ తెలీనట్లు ముఖంపెట్టి "నే నంత ధనికు రాల్ని కాను - మీరేమడుగుతారో" అంది.

"అమ్మమ్మా. మీ దగ్గరున్న ధనరాసుల గురించి మీకేం తెలుసు? కొన్ని లక్షలు పోసినా అవి రావు" అన్నాడు. హరిణ ఆశ్చర్యపోయింది. నిజంగా తనలో ఏముంది? గుండె ఝల్లుమంది. ఎంతో అపురూపమైందీ, కలకాలం దాచుకోవాల్సిందీ, కొల్లగొడదామని చూస్తారు.

హరిణకి అతని ఉద్దేశం అర్థమైంది - ఎలా చెప్పాలో ఏం చెయ్యాలో తోచలేదు.

నవ్వి వూరుకుంది. అలాంటివేళ నవ్వడం తప్పని తెలుసుకునేంతటి వయస్సు లేదు హరిణకి.

హరిణ ప్రొబేషన్ ఒక సంవత్సరం పొడిగించబడింది. కారణం ఎవ్వరికీ తెలీదు. ఆఫీసులో అంతా అయ్యో పాపం అనుకున్నారు. చాలా హార్డు వర్కర్ అని కూడా అనుకున్నారు. హరిణకి తల కొట్టేసినట్లు అనిపించింది. ఎందుకలా జరిగిందో తెలిసినా, బయటపెట్టే విషయం కాదు. అందుకే చాలా మందితో తను టెస్టు బాగా రాయలేదని చెప్పుకుంది.

వనజ సెకండ్ బి. ఏ. లోకి వచ్చింది. ఆ రోజే ఎంప్లాయిమెంట్‌లో రిజిష్టర్ చేసింది. "ఎందుకే" అంటే - "అది వచ్చేసరికి చాలా టైము పడుతుంది. ఒకవేళ అది త్వరగా వస్తే చదువు మానేస్తా" అంది.

హరిణ ఆశ్చర్యపోయింది.

"అంత అవసర మేముంది?" అంది.

"ఉద్యోగంలో చేరితే నాకు స్వేచ్ఛ వచ్చినట్లు వుంటుంది" అంది.

"ఇప్పుడు నీకేం తక్కువైంది? నలుగురిలో ఎందుకా స్వేచ్ఛ?" అని అందామనుకుంది కాని హరిణ అనలేదు. దాని కేలాంటి జవాబు వస్తుందో ఆమె వూహించి వూరుకుంది.

o o o

ఆ రోజు ఆఫీసు నుంచి మరీ ఆలస్యంగా వచ్చింది.

సుమారు ఏడున్నరయింది - పని చేసుకుంటుంటే మాటల్లో పెట్టేశారు మేనేజరు. అతను ఎదురుగా కూర్చుంటే పని సాగలేదు. అలా అని వెళ్ళిపోతే బాగుండదేమోనని కూర్చుండి పోయింది.

ఇంట్లో అడుగు పెడుతూనే భయమేసింది. అమ్మ విలేసి అడుగు

తుంది. అందరికీ లేదా ఆఫీసు, నీ కొక్క దానికేనా - ఆడపిల్లవు. ఇంత సేపు ఆఫీసులో వుంటే పరువేమైనా వుంటుందా అని అరుస్తుంది. అంతగా కాకపోతే ఉద్యోగం మానెయ్ అని బెదిరిస్తుంది_నిజంగా ఆలా అంటే తను రేపే రాజీనామా యిచ్చేస్తుంది—

హరిణ యింట్లో అడుగు పెట్టింది. తల్లి ఏమీ మాట్లాడలేదు. "అయ్యో, అలసిపోయి వచ్చావా కాఫీ తాగు" అంటూ ఓపిక లేకపోయినా కాఫీ కలిపి యిచ్చింది.

వనజ నిరసనగా చులకనగా చూడలేదు.

"అక్కా వంట చేసేశాను. ఆకలేస్తే చెప్పు. వస్తా. యిద్దరం తిందాం" అని పుస్తకంలో మునిగిపోయింది. తను యిలా యింత రాత్రి వరకు వుండి పని చెయ్యడం ఎంతో సామాన్యమైన విషయంగా భావిస్తున్నారు, యింట్లో అంతా_"అయ్యో! తన్నెందుకు తిట్టరు? కేక లెయ్యరు? అవమానించి ఉద్యోగం మానెయ్యమని గొడవ ఎందుకు చెయ్యరు?"

బాధగా హరిణ మంచంమీద వాలి కళ్ళు మూసుకుంది.

o o o

రెండోసారి కూడా ప్రొబేషన్ పొడిగించమని పైకి రాసేస్తానని ఆ రోజు బెదిరించాడు వ్యాఘ్రేశ్వరరావు. — తనంటే ఎంతోమందికి యిష్టం అని, కాని తనకి ఎందుకో హరిణంటే ఎనలేని ప్రేమ పుట్టుకొచ్చిందని, ఆమె లేకపోతే బ్రతుకు నిస్సారంగా అనిపిస్తోందని చెప్తూ తన కోరిక తీర్చకపోతే ముందడుగు లేదని, రెండోసారి, మూడోసారి చూసి ఉద్యోగం పీకేస్తారనీ చెప్పి. మరీ విశదీకరించాడు. ఆ రోజు హరిణ మనసు వికలమైపోయింది - ఒక్కసారి ఉద్యోగం పోతుందంటే బాధగా అనిపించింది—

తనకి వెంటనే మంచి వరుడిని చూసి పెళ్ళిచేసెయ్యటానికి నాన్న లేడు అని తలుచుకుని కుమిలిపోయింది.

ఆ రోజు వెలుగుండగానే యింటికి బయలు దేరింది.

ముందుగదిలో ఎవరో కూర్చుని వున్నారు. దూరంగా గడప దగ్గర అమ్మ కూర్చుని ఆ వచ్చినాయనతో మాట్లాడుతోంది హరిణని చూడగానే "అదిగో అమ్మాయి మాటల్లోనే వచ్చేసింది" అంది తల్లి.

"సరే మీరు బాగా యోచించండి" అన్నాడాయన. లోపల గదిలో వున్న హరిణకి వాళ్ళమాటలు స్పష్టంగా వినబడుతున్నాయి.

"ఆలోచించాల్సిందేమీలేదు, మా అబ్బాయికి పన్నెండో ఏడు. వాడు బి.ఎ. అయి నాలుగురాళ్ళు సంపాదించే వరకు దీని పెళ్ళిమాట ఎత్తేపని లేదు. అయినా ఏమంత వయస్సు, ఇరవై రెండు. ముప్ఫయి ఏళ్ళు పైబడి పెళ్ళిళ్ళు కాకుండా బోలెడుమంది వున్నారు"—

"మరే - మరే" అంటున్నాడా వచ్చినాయన.

"అయినా అది పెళ్ళిచేసుకు వెళ్ళిపోతే యీ సంసారం యిప్పుడు గడిచేదెల్లా? నావల్ల కాదు, ఏదో దేవుడి దయవల్ల దానికైనా ఉద్యోగం వచ్చింది" అంటూ నిట్టూర్చింది-

హరిణ కొయ్యబారి పోయింది. ఇరవై రెండేళ్ళు పెళ్ళివయసు కాదా అని కుమిలిపోయింది.

కాస్సేపు ఏవో కబుర్లు చెప్పి, ఆ పెళ్ళిపెద్ద వెళ్ళిపోయాడు. మగ పిల్లలిద్దరూ చదువుకుంటున్నారు. వనజ ఏవో బొమ్మ లేసుకుంటోంది. హరిణ మంచంమీద వొరిగింది.

* * *

హరిణ ఆ రోజు చాలా తడబాటుగా వుంది. ఆమె తండ్రి పోయాక వచ్చే యిన్సూరెన్సు వచ్చింది - అమ్మ దాన్ని అయిదేళ్ళకి ఫిక్సెడ్‌లో వేసింది - ఆ డబ్బు తీసే వుద్దేశం లేదు. తనకి పెళ్ళి చేసెయ్యాలని తల్లికి లేదని నిన్ననే తెలిసిపోయింది. మనసు బండబారిపోయింది.

ఆఫీసు కెళ్ళగానే వ్యాఘ్రేశ్వరరావు పిలుస్తున్నట్లు కబురొచ్చింది. సీట్లో రెండు నిముషాలు తీవ్రంగా ఆలోచించి వెంటనే లేచి వెళ్ళింది. భయంగా, బెరుకుగా, తడబాటుగా వెళ్ళే హరిణ దర్జాగా, విలాసంగా, దర్పంగా వెళ్ళింది - అతనితో మాట్లాడి చిరునవ్వులు చిందిస్తూ బయట కొచ్చింది.

ఆ సాయంత్రం ఆరుగంటలకి హరిణ ట్రిమ్‌గా తయారై ఆఫీసులో పనుందని తల్లితో చెప్పి బయలుదేరింది. సందెముగ్గు వేద్దామని వొత్తుగా చల్లిన కళ్ళాపుకి, బురదగా వున్న గుమ్మంలో కాలు సర్రున జారింది. గేటు పట్టుకుని నిలతొక్కుకుని ముందుకు సాగింది హరిణ.

* * *

పరుగెడుతున్న లేడిపిల్ల అసిలిపోయింది. తనవాళ్లెవరూ కనిపించ లేదు. ఎవరికోసం బ్రతకాలి అనుకుందో వారెవ్వరూ కనిపించలేదు (నీడ చూసి చెట్టుకింద ఆయాసంగా నిలబడింది. చెట్టుమించి చిరుతపులి లేడి మీదకే దూకింది. తల కొరికేసింది.)

అందుకని- తనే పులికి ఎదురెళ్ళి "నన్ను బలితీసుకో, దేనికోసం నేను బ్రతకాలనుకున్నానో అది నాకు దక్కదు" అంది—

లేడి దయనీయస్థితికి నొచ్చుకుని, పులి వదిలేయలేదు- మీదకురికి మెడ కొరికేసింది.